# 24

# మారుమనస్సునొందని పట్టణములు

## (11:20-24)

యేసు కొరాజీనా, బేత్సయిదా, మరియు కపెర్నహూములో చేసిన అద్భుతకార్యముల గూర్చి సువార్తలలో గ్రంథస్థంచేయబడలేదు (యోహాను 21:25 చూడు). ఈ పట్టణములు ఏదో ప్రశస్తమైనది కొంచెము ప్రధానము చేయబడినవి, అయితే అవి వాటిని బొత్తిగా అలక్ష్యము చేసినవి.

### రెండు పట్టణములకు రెండు శ్రమలు (11:20–22)

**[20]పిమ్మట ఏ యే పట్టణములలో ఆయన విస్తారమైన అద్భుతములు చేసెనో ఆ పట్టణములవారు మారుమనస్సుపొందకపోవుటవలన ఆయన వారి నిట్లు గద్దింపసాగెను. [21]అయ్యో కొరాజీనా, అయ్యో బేత్సయిదా, మీ మధ్యను చేయబడిన అద్భుతములు తూరు సీదోనుపట్టణములలో చేయబడిన యెడల ఆ పట్టణములవారు పూర్వమే గోనె పట్ట కట్టుకొని బూడిదె వేసికొని మారుమనస్సు పొందియుందురు. [22]విమర్శదినమందు మీ గతికంటె తూరు సీదోను పట్టణములవారి గతి ఓర్వతగినదై యుండునని మీతో చెప్పుచున్నాను.**

**వచనము 20. మారుమనస్సు నొందుటకు** నిరాకరించినవారి గూర్చి మాటలాడినప్పుడు యేసు మరి ఎక్కువ నిర్దిష్టముగా మాటలాడాడు. ఆయన తన దృష్టిని తాను **విస్తారమైన అద్భుతములు చేసిన** ఆ **పట్టణముల** మీదికి మళ్లించాడు: కోరాజీనా, బేత్సాయిదా, మరియు కపెర్నహూము. "అద్భుతములు" అను అర్థమిచ్చు గ్రీకు పదము (*dunamis*) "శక్తి" అని తరుచుగా అనువదింపబడిన అదే పదమై యున్నది. ఈ పట్టణములు వాటి మధ్యన ప్రదర్శింపబడిన దేవుని శక్తిని కళ్లారా చూసాయి, కానీ తత్ఫలితంగా దేవునితో వాటికుండిన సంబంధము ఏ మాత్రమును మారలేదు. యేసు చేసిన శక్తివంతమైన కార్యములు ఆయన ఉపదేశములలో నుండిన దైవికమైన అధికారమును రుజువు చేసాయి, అట్లయినప్పటికిని వారు దానిని తోసిపుచ్చారు. ఆయన చేసిన అద్భుతకార్యములుగాని, ఉపదేశములుగాని వారి మనస్సులను కదిలించలేదు, కరిగించలేదు గనుక వారు మారుమనస్సునొందలేదు. కాబట్టి, యేసు ఆ పట్టణములను **గద్దింపసాగెను**.

**వచనము 21. శ్రమ** అను అర్థమిచ్చు గ్రీకు పదము (*ouai*) ప్రగాఢమైన దయ లేదా తీవ్రమైన ఆగ్రహమును సూచించు పదమై యున్నది. ఇచ్చట దాని ఉద్ఘాటన ఆయన చేసిన ఉపదేశములు వారు తృణీకరించి నందునుబట్టి క్రీస్తుకు కలిగిన దుఃఖముపై కలదు. విల్యమ్ బార్క్లే ఇలా వ్రాయుచున్నాడు, "యేసు పాపమును ఖండించుటలో ప్రదర్శించుచున్న ఆగ్రహము పరిశుద్ధమైనదై యున్నది, కానీ, ఈ కోపము, అత్యాచారపూర్ణమైన గర్వము నుండి కాదు, కానీ విరిగిన నలిగిన హృదయములో నుండి వచ్చుచున్నది."[1]

ప్రభువు గద్దించిన మొదటి పట్టణము **కొరాజీనా.** అది కపెర్నహూమునకు సమీపమున నున్న ఒక స్వల్పమైన గ్రామమని అనుకొనబడుచున్నది. అసలు స్థలము "ఖీర్‌బేత్ కెరాజె అయియుండవచ్చును, ఇది గలిలయ సముద్రతీరము నుండి దాదాపు మూడు మైళ్ల దూరములో టెల్ హుమ్‌నకు (కపెర్నహూమ్) ఉత్తరాన నున్న ఎత్తైయిన చోటై యుండవచ్చును."[2] యేసు కొరాజీనాలో పరిచర్య చేసినట్లు సువార్తలలో వ్రాయబడలేదు. ఆ పట్టణములో ఏదైన ఒక నిర్దిష్టమైన అద్భుతకార్యము చేయబడినట్లు కూడ పేర్కొనబడలేదు. సహజంగానే, యేసు చేసిన కార్యములలో సువార్తలు మచ్చుకు కొన్నింటిని మాత్రమే గ్రంథస్థం చేసాయి (యోహాను 20:30; 21:25). నిజాయితీతో కూడిన హృదయములు గల ప్రజలు విశ్వసించునట్లు చేయుటకు అచ్చోట చేయబడిన అద్భుత కార్యములు చాలినంత సంఖ్యలోఉండినవని క్రీస్తు చేసిన ప్రకటనయే సూచించినది.

యేసు గద్దించిన రెండవ పట్టణము, **బేత్సయిదా,** ఈ పట్టణము గలిలయ సముద్రము ఉత్తర తీరమున, యొర్దాను నది ఆ సముద్రములోనికి ప్రవేశించి దానిలో కలిసిపోవుచుచుండిన తూర్పున నుండిన జాలరుల గ్రామమై యుండినది (మార్కు 6:45; 8:22; లూకా 9:10). ఇది పేతురు, అంద్రెయ, మరియు ఫిలిప్పు యొక్క స్వస్థలమై యున్నది (యోహాను 1:44). క్రీస్తు గ్రుడ్డివానికి చూపు దయచేయుట గూర్చి గ్రంథస్థం చేయబడిన ఒకే ఒక అద్భుతకార్యము ఈ పట్టణముతో సంబంధముగలదై యున్నది (మార్కు 8:22–26). ఏదిఏమైనా, ఇతర స్వస్థత సంబంధిత అద్భుతకార్యములు మరియు ఐదు వేల మందికి ఆహారము పెట్టబడుట ఈ పట్టణమునకు సమీపమున చేయబడినవై యున్నవి (లూకా 9:10–17). ఇవే సువార్తలలో వ్రాయబడని యింకా కొన్ని అద్భుత కార్యములు కూడ బేత్సయిదాలో చేయబడి యుండవచ్చును.

ఈ రెండు పట్టణములలో చేయబడిన **అద్భుత కార్యములు తూరు మరియు సీదోను** పట్టణములలో చేయబడి యుండినట్లయితే, అచ్చటి ప్రజలు **ఎంతో కాలం క్రితమే మారుమనస్సు నొందియుండెడివారని** యేసు సెలవిచ్చాడు. తూరు మరియు సీదోను, నౌకాశ్రయ కేంద్రములుండిన పట్టణములు యుండినవి, గనుక ఆ పట్టణ వాస్తవ్యులు వ్యాపారస్తులనియు, వలసరాజ్యస్థాపకులనియు పిలువబడుచుండిరి. వారు ప్రాచీన ఫేనీకేయుల సంతతివారై యున్నారు. పాత నిబంధనలో, తూరు మరియు సీదోను పట్టణ ప్రజలు బయలు దేవతను ఆరాధించారు గనుక వారు నీతిబాహ్యమైన పనులకును లంచగొండితనమునకును పేరుగాంచినవారై యుండిరి. ఈ రెండు పట్టణములు కూడ వాటి దుర్మార్గతనుబట్టి ప్రవక్తల చేత ఖండింపబడినవి (యెషయ 23:1–18; యిర్మీయా 25:22; 47:4; యెహెజ్కేలు 26–28; ఆమోసు 1:9, 10).

యేసు తూరు మరియు సీదోను పట్టణముల పరిసర ప్రాంతముల గుండా పయనించుచు కనీసము ఒక్క అద్భుతకార్యమునైనా చేసియుండును (15:21–28). తూరు పట్టణము మధ్యధరా సముద్ర తీరమున నుండినది, గలిలయ సముద్రమునకు దాదాపు 25 మైళ్ల దూరములోను, యెరూషలేమునకు దాదాపు వంద మైళ్ల దూరములోను ఉండినది. పౌలు తన మూడవ మిషనరీ ప్రయాణము ముగించుకొని యెరూషలేమునకు వెళ్లుచుండినప్పుడు మార్గమధ్యలో ఇచ్చట ఆగాడు (అపొస్తలుల కార్యములు 21:3, 4). సీదోను పట్టణము తీరమునకు దాదాపు 20 మైళ్ల దూరము యింకా ముందుకు కలదు. పౌలు రోమా

నగరమునకు వెళ్లుచు, ఈ స్థలమందు కూడ ఆగాడు (అపొస్తలుల కార్యములు 27:3).

యేసు మారుమనస్సు నొందుట గూర్చి మాటలాడినప్పుడు, ఆయన దానికిని **గోనెపట్ట కట్టుకొని బూడిదె వేసికొనుటకు** సంబంధమును ముడిపెట్టాడు. "గోనెపట్ట," ఒంటె లేదా మేక రోమముల చేత నేయబడిన ముతక గుడ్డయై యుండి, దినుసులు మరియు ఇతర వస్తువులను రవాణ చేయుటకు వీలుగా నుండు సంచులుగా తయారుచేయబడినది. బీదవారు దీనినే వారి కొరకు వస్త్రములను కుట్టించుకొనుటకు ఉపయోగించుకొన్నారు. గోనెపట్ట కట్టుకొని, దానితో పాటుగా "బూడిదె" వేసికొనుట, బహుగా నలిగిన హృదయములోని పశ్చాత్తాపమునకు లేక మనస్తాపమునకు ఒక సంకేతమై యుండినది (ఎస్తేరు 4:1; యెషయా 58:5; దానియేలు 9:3; యోనా 3:6).

**వచనము 22. తూరు మరియు సీదోను** పట్టణముల దూర్మార్గతనుబట్టి, **విమర్శ దినమందు** ఈ పట్టణముల గతి కొరాజీనా మరియు బేత్సయిదా పట్టణముల గతి కొరజీనా మరియు బేత్సయిదా పట్టణముల గతి కంటె **ఓర్వతగినదై** యుండునని యేసు సెలవిచ్చాడు. ఎందుకని? కొరాజీనా మరియు బేత్సయిదా పట్టణములలో చేయబడిన అవే అద్భుతకార్యములు, తూరు మరియు సీదోను పట్టణములలో చేయబడినట్లయితే, ఈ పట్టణములు మారుమనస్సు నొందియుండేవే అనునది ఆయన అంతస్సూచనయై యున్నది. వాస్తవమునకు, ఆది సంఘు చరిత్ర ప్రకారము తరువాత రోజుల్లో ఈ రెండు పట్టణములలోను శిష్యులుండిరని లూకా వ్రాసిన సువార్త తెలియజెప్పుచున్నది (అపొస్తలుల కార్యము 21:3–6; 27:3; 10:15పై గల వ్యాఖ్యానములను చూడు).

### "హెచ్చింపబడిన" పట్టణము గద్దింపబడుచున్నది (11:23, 24)

**[23]కపెర్నహూమా, ఆకాశము మట్టునకు హెచ్చింపబడెదవా? నీవు పాతాళమువరకు దిగి పోయెదవు. నీలో చేయబడిన అద్భుతములు సొదొమలో చేయబడిన యెడల అది నేటివరకు నిలిచియుండును [24]విమర్శదినమందు నీ గతికంటె సొదొమ దేశపువారి గతి ఓర్వతగినదై యుండునని మీతో చెప్పుచున్నాననెను.**

**వచనములు 23, 24. కపెర్నహూము** గలలియ సముద్రము యొక్క వాయవ్య తీరమున ఉండినది. ఇంతకు మునుపు గమనింపబడినట్లుగా, యేసు పరిచర్య చేయుచుండిన దినములలో అది ఆయనకు దాదాపుగా ఒక సొంత నివాసస్థలమై యుండినది (4:13; 8:5; 9:1పై గల వ్యాఖ్యానములను చూడు). యేసు చేసిన అద్భుతకార్యములలో చెప్పుకోదగినన్ని అద్భుతకార్యములు కపెర్నహూములో చేయుచుండిన దినములలో అది ఆయనకు దాదాపుగా ఒక సొంత నివాసస్థలమై యుండినది (4:13; 8:5; 9:1పై గల వ్యాఖ్యానములను చూడుము). యేసు చేసిన అద్భుతకార్యములలో చెప్పుకోదగినన్ని అద్భుతకార్యములు కపెర్నహూములో చేయబడినవి (8:5–17; 9:1–8, 18–26; మార్కు 1:21–28; యోహాను 4:46–54). మత్తయి వ్రాసిన సువార్త 8 మరియు 9 అధ్యాయములలో గ్రంథస్థంచేయబడిన పది అద్భుతకార్యములలో ఐదు కపెర్నహూములో చేయబడినవి.

కపెర్నహూము సౌభాగ్యసమృద్ధిగలది, స్వావలంబనముగలది, మరియు ప్రపంచములో ఒక సురక్షితమైన పట్టణమై యుండెను. దాని సొంత అంచనా ప్రకారము, ఈ పట్టణము

**ఆకాశము మట్టునకు హెచ్చింపబడినదై** యుండెను. కపెర్నహూము హెచ్చింపబడినదై యుండిన అనుభూతిని అనుభవించుచుండినప్పటికిని, అది **పాతాళము** వరకు దిగిపోవును. యేసు ఈ భాషను అహంకారముతో నిండియుండిన బబులోను రాజునకు వ్యతిరేకముగా యెషయా పలుకుచుండిన ఎత్తిపొడుపు మాటల నుండి తీసికొని యుండవచ్చును: " 'నేను ఆకాశమున కెక్కిపోయెదను; దేవుని నక్షత్రములకు పైగా నా సింహాసనమును హెచ్చింతును ...' అని నీవు నీ మనస్సులో అనుకొంటివిగదా? నీవు పాతాళమునకు, నరకములో ఒక మూలకు త్రోయబడితివే" (యెషయా 14:13-15).

పాత నిబంధనలో "షియోలు" అను పదము వాడబడినట్లుగానే క్రొత్త నిబంధనలో "పాతాళము" అను పదము ప్రయోగింపబడినది. ఈ పదము "సమాధిని," "మృతుల లోకము," మరియు "యాతనను" సూచించును. లియోన్ మోర్రిస్ ఇలా వివరించుచున్నాడు, "*ఆకాశము* అను పదము అత్యంత ఎత్తుగా నుండుటకు సాధ్యమగు స్థలమును సూచించుచున్నదో, అలాగే పాతాళము దిగువన తక్కువైన స్థలమును సూచించుచున్నది."[3] "ఆకాశము మట్టుకు హెచ్చింపబడుట" మరియు "పాతాళము వరకు దిగివచ్చుట" అను పదజాలములు, ఈ పట్టణము మొదటి శతాబ్దములో కలిగియుండిన ప్రాముఖ్యత, తరువాత రోజుల్లో దానికి కలుగనై యుండిన నాశనముతో పోల్చబడునట్లు అలంకార యుక్తంగా ప్రయోగింపబడినవి.[4]

మనకు తెలిసినంత మేరకు, తీవ్రమైన అనైతికము లేదా లైంగిక వక్రబుద్ధి గూర్చి కపెర్నహూముపై నేరారోపణ చేయబడలేదు. అట్లయినప్పటికిని, యేసు ఈ పట్టణమును సొదొమ పట్టణముతో పోల్చుచున్నాడు. పాత నిబంధనకు సంబంధించిన ఈ పట్టణము దుర్మార్గతకు ఒక పర్యాయపదమైపోతుంది (ఆదికాండము 19:24; ద్వితీయోపదేశకాండము 32:32; యెషయా 1:9, 10; యిర్మీయా 49:18; విలాపవాక్యములు 4:6; యెహెజ్కెలు 16:48; మత్తయి 10:15; 2 పేతురు 2:6). "Sodomy" పురమైథునం మరియు "sodomite" (పురుషగాములు) అను పదములు ఆ పాపమును మరియు అట్టి పాపము చేయువారిని గుర్తించుటకు ప్రయోగింపబడునంతగా ఈ పట్టణములో స్వలింగ (పురుష) సంపర్కమును సంబంధించిన పాపము ప్రబలి యుండినది.

కపెర్నహూము పట్టణము యొక్క పరిస్థితి సొదొమ పట్టణము పరిస్థితి కంటె ఘోరమైనదై యున్నదని పరిగణింపబడినది. కపెర్నహూములో చేయబడిన **అద్భుతకార్యములు సొదొమ** పట్టణములో చేయబడి యుండినట్లయితే, ఆ పట్టణము నాశనమయ్యేది కాదు. ఈ హేతువునుబట్టియే, యేసు కొరాజీనా మరియు బేత్సయిదా పట్టణముల గూర్చి చేసిన ఘోషణ సారాంశమును కపెర్నహూము పట్టణమునకు వర్తింపజేయుచు పునరుక్తము గావించాడు: **విమర్శ దినమందు, నీ గతి కంటె సొదొమ దేశపువారి గతి ఓర్వతగినదై యుండను** (10:15; 11:22పై గల వ్యాఖ్యానములను చూడు).

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### మారుమనస్సు నొందని పట్టణములు (11:20-24)

ఇతర పట్టణములకు ఈ సత్యము బయలుపరచబడక యుండగా, క్రీస్తును గూర్చి

నేర్చుకొని ఆయనను వెంబడించునట్లు ప్రపంచములో ఎన్నో పట్టణములకు ఇట్టి గొప్ప అవకాశము లభించి యుండునుకదా? ప్రపంచములోని అనేక ప్రాంతములు రేడియో మరియు దూరదర్శిని ద్వారా సువార్త వినగలుగునట్లు వాటికి ఎన్నో అవకాశము లభించినవి. పరిశుద్ధ సత్యవేదము వారి స్వదేశీయ భాష మరియు మాండలికములలో వారికి ఎంతో సమీపముగా అందుబాటులో ఉంటున్నది. ఇంతమాత్రమేగాక, ప్రతి దినము క్రీస్తు వెలుగును వారిపై ప్రకాశించుచుండు విశ్వసనీయమైన క్రైస్తవ విశ్వాసులు వారి మధ్యనే నివసించుచుందురు. బహుశా వారి సమాజములు జాతీయ లేక స్థానిక విపత్తులకు గురైనప్పుడు వారు క్రైస్తవుల ఉదారత చేత దీవింపబడి యుందురు. ఏదిఏమైనా, ఇన్ని అవకాశములుండినప్పటికని, వారు క్రీస్తును తృణీకరించుచున్నారు. దీనికి తారతమ్యముగా, యేసు పేరు ఎన్నడు విననివారు ఎందరో ఉన్నారు, వారికి పరిశుద్ధ సత్యవేదము అందుబాటులో లేదు. వారి సమాజములలో నివసించు క్రైస్తవులు బహు కొద్ది మందియై యుండవచ్చును లేదా, అసలే లేకపోవచ్చును. నిశ్చయముగా, అధికంగా, అవకాశములు అందుబాటులో నున్నవారు అత్యంత తీవ్రముగా తీర్పు తీర్చబడుదురు.

డేవిడ్ స్టూవర్ట్

## దైవికమైన విపరీతార్థము (11:23)

క్రీస్తును వ్యతిరేకించువారు ఈ జీవితంలో ఎంత తరుచుగా కృతార్థులగుచున్నట్లు అగుపించుచున్నది? బహుశా వారు ఉన్నతాధికారము గల పదవులలో ఉండవచ్చును, బ్యాంకులలో వారికి విస్తారమైన నిధులుండవచ్చును, మరియు సుఖము నొసగెడు సౌకర్యవంతమైన ఇళ్లుండవచ్చును. ఐహిక ప్రమాణముల ప్రకారము, వారు సమస్తము కలిగియున్నట్లు అగుపించుచున్నది. వారు "హెచ్చింపబడినవారై" యున్నట్లున్నారు.

ఈ విధంగా ఉన్నత స్థానం వరకు హెచ్చింపబడి యుండుట, వాస్తవము కంటే ఎక్కువగా ఊహించుకొనబడుచున్నదై యుంటున్నదని యేసు హెచ్చరించాడు; ఏలయనగా అవన్నీ శాశ్వతమేమీ కాదు, కొంత కాలమే నిలిచియుండును. వ్రాయబడియున్నట్లు, ప్రజలు మారుమనస్సు నొందకుండునట్లు ఆయన అత్యధిక అద్భుతకార్యములు చేసిన పట్టణమును ఆయన గద్దించాడు. "కపెర్నహూమా, ఆకాశము మట్టునకు హెచ్చింపబడెదవా? నీవు పాతాళము వరకు దిగి పోయెదవని" ఆయన సెలవిచ్చాడు (11:23). వారు రక్షకునివైపు మళ్లుట లేదు కాబట్టి వారి వైభవము నశించును.

దైవికమైన ఈ విపరీతార్థమును యేసు సువార్తలలో అనేక పర్యాయములు పునఃరుక్తము గావించాడు: "తన్నుతాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును; తన్నుతాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును" (23:12; లూకా 14:11; 18:14 చూడు).

డేవిడ్ స్టూవర్ట్

---

సూచనలు

[1]William Barclay, *The Gospel of Matthew,* vol. 2, 2d ed., The Daily Study Bible (Philadelphia: Westminster Press, 1958), 13. [2]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 164. [3]Leon Morris,

*The Gospel according to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 290. [4]J. W. McGarvey, *The New Testament Commentary,* vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publising Co., n.d.), 101.